# అవసరం

సుబ్బలక్ష్మికి జూనియర్ కాలేజీలో చదువు పూర్తి చెయ్యగానే సుబ్బారావుతో పెళ్ళయి చదువు ఆగిపోయింది.

పెద్దగా చదువుకోని సుబ్బలక్ష్మి భర్త ఉద్యోగం చేస్తున్న పెద్ద ఊళ్ళో కాపురము మొదలుపెట్టింది. సుబ్బారావుకి ఓ స్కూటరు, సాయంత్రాలు దానిమీద భార్యని తిప్పే తీరుబడి, ఉండడంతో సుబ్బలక్ష్మి కి రోజులు చాలా మధురంగా గడుస్తున్నాయి.

పెళ్ళవగానే వచ్చిన మొదటి సంక్రాంతికి సుబ్బారావుని, కూతుర్ని రమ్మని సుబ్బలక్ష్మి తండ్రి పిలిచాడు. భార్యా భర్తలు ఆనందంగా సంక్రాంతికి ఆపల్లెటూరు వెళ్ళారు. సుబ్బలక్ష్మిని ఆమె పుట్టింట్లో అందరు ఆమె పట్టణం కాపురము గురించి ప్రశ్నించారు. సుబ్బలక్ష్మి తను భర్త స్కూటరుమీద ఎలా షికార్లు కొట్టేదీ, హోటళ్ళకి, సినిమాలకి ఎలా వెళ్ళేది కొంచెం గర్వంగా చెప్పింది.

"మొగుడిని కావలించుకుని నలుగుర్లో ఎలా తిరుగుతావే! నాకైతే సిగ్గుతో ప్రాణం చచ్చిపోతుంది" అంది సుబ్బలక్ష్మి పెద్దక్క. ఆమెను మరో పల్లెటూళ్ళో భూములున్న ఆసామీకిచ్చారు. ఆ ఊళ్ళో మొగుడుపెళ్ళాలు తప్పనిసరయినపుడు తప్పించి కలిసి రిక్షాకూడా ఎక్కరు. కలిసి సినిమాకు వెళ్ళరు కలిసిఎప్పుడైనా సినిమాకు వెళ్ళినా కలిసి కూర్చోరు!

"సిటీల్లో మొగుడ్తో కాకుండా ఆడవాళ్ళు ఒక్కళ్ళూ ఎక్కడికైనా వెళితే ప్రమాదం కాదూ! ఆటోరిక్షావాళ్ళూ, రిక్షావాళ్ళు వంటరిగా ఆడదిఎక్కిందంటే మోసం చేస్తారు. ఇంకా ఏమన్నాచేస్తారు పొద్దున్న నుంచి భర్త కోసం ఒంటరిగా వేచివున్న భార్యకి మరి భర్త రాగానే అతనితో కాస్త అలా తిరిగిరావాలనిపిస్తుంది. అయినా వెనక కూర్చుంటాను గాని పబ్లిక్‌లో కావిలించుకోనే అక్కా. కొందరు సినిమాల్లో చూపించేలాకూర్చుని మొగుణ్ని గట్టిగా కరిచిపెట్టుకొంటారనుకో, వాళ్ళు మరీ సొసైటీ లేడీస్. మన లాంటి సంసారులు చెయ్యరు" అని సుబ్బలక్ష్మి సమర్థించుకొంది.

"మరి స్నేహితులింటికి వెళ్ళినప్పుడు ఆడామగా కలిసి కబుర్లు చెప్పుకొంటారన్నావు, మగవాళ్ళతో మాట్లాడటానికి ఆడవాళ్ళకేం ఉంటాయే కబుర్లు?"

"మాట్లాడటానికి తెలిసినవాళ్ళు అగుపించక, తెలిసినవాళ్ళలో సగంమంది మగవాళ్ళే అయితే కబుర్లు అవేవస్తాయి అవసరాన్ని బట్టి, నీకు మీ ఊళ్ళో మీ ఆయన నిన్ను

ఎక్కడికైనా తీసుకెళ్ళాల్సిన అవసరంలేదు. నువ్వే వెళతావు. నీకు నీ స్నేహితులే చాలా మంది వున్నారు. కనుక బావ స్నేహితులతో మాట్లాడాల్సిన అవసరం లేదు. అందుకని నీకలా అనిపిస్తుంది. సిటీస్‌లో మా అవసరాలు వేరు, మా పద్ధతులు వేరు" అని చెప్పింది సుబ్బలక్ష్మి.

అక్కతో ఈ సంభాషణ జరిగిన తరువాత సుబ్బలక్ష్మి తనకి తాను "అవసరం" "అనవసరం" అన్న విషయాలపై ఓ పెద్ద థియరీ తయారు చేసుకొని తన ప్రవర్తనని ఇతర్ల ప్రవర్తనని ఆ థియరీ ప్రకారం ఎనలైజ్ చెయ్యడము మొదలుపెట్టింది.

ఓ రోజు సుబ్బారావు సుబ్బలక్ష్మిని తనుస్నేహితుడు కామేశ్వరరావు ఇంటికి తీసుకువెళ్ళాడు. సుబ్బలక్ష్మి ఆ ఇంటికి వెళ్ళడం అదే మొదటిసారి. కామేశ్వరరావు భార్య కామేశ్వరి కాలేజీలో లెక్చరర్. ఆమెకి వారం అంతా కాలేజీపని, పిల్లలపని, ఇంటిపని వారాంతంలో వారంలో చెయ్యగా మిగిలిన ఇంటిపనులు, కాలేజీ పనులతో క్షణం తీరిక ఉండదు. అందుకని కామేశ్వరరావు స్నేహితుల్ని పిలిస్తే ఫలానా రోజున ఇన్నింటికిరండి అని పిలుస్తాడు. లేకపోతే "మీ ఇంటికి" ఆదివారం అయిదింటికి రామా? లేక మీకు వేరే పనులన్నాయా?" అని అడిగి "రండి" అంటే వెళ్తాడు.

కామేశ్వరరావు దంపతుల సుబ్బలక్ష్మి వచ్చిన కొత్తలో చూడటానికి వచ్చి, "మీరు మా యింటికి రావాలి ఓ రోజు. ఏ రోజో మేము సుబ్బారావు గారితో ముందుగా చెప్తాం" అన్నారు.

వాళ్ళు వెళ్ళిపోయాక, "అదేంపిలుపు వాళ్ళింటికి చెప్పకుండా వెళితే రానివ్వరా?" అని అడిగింది సుబ్బలక్ష్మి భర్తని.

"ఎందుకు రానివ్వరు? రానిస్తారు. కాని నీతో మాట్లాడుతూ కూర్చోటానికి వాళ్ళకి కుదరదు. కనక వాళ్ళ పనులు వాళ్ళు చేసుకొంటూ నీతో మాట్లాడతారు. అలా మాట్లాడవలసి వచ్చినందుకు నొచ్చుకుంటారు. నువ్వు వాళ్ళింటికి వచ్చినపుడు తృప్తిగా కబుర్లు చెప్పలేకపోయామే అని బాధ పడతారు. అదే వాళ్ళకు తీరుబడైన రోజున వెళతామనుకో, వాళ్ళు మన రాకకు సంతోషిస్తారు" అన్నాడు.

సుబ్బలక్ష్మికి భర్త సమర్ధింపు నచ్చలేదు.

అది జరిగిన మూడు నెలలకే ఆ రోజు వాళ్ళు పిలిచారు. వీళ్ళు వెళ్ళారు. కామేశ్వరి కామేశ్వరరావు సాదరంగా సుబ్బారావుని, సుబ్బలక్ష్మిని ఆహ్వానించారు. కామేశ్వరరావు తెల్లటి లాల్చీ పంచకట్టుకొని స్థిమితంగా ఏహడావిడిలేకుండా కనిపించాడు. కామేశ్వరికూడా తను ఇంకోళ్ళింటికి వెళుతున్నట్టుగా ముస్తాబయింది. ఇల్లు అందంగా సర్ది వుంది.

ఇంకాస్సేపు కబుర్లు చెప్పుకొన్నారు. సుబ్బలక్ష్మిలో అసహనం కలిగింది. "ఏమిటీవిడ కాఫీ కలపటానికైనా లేవదేం!" అనుకొంది.

"మీ అమ్మగారు వచ్చారన్నావు ఏరీ ఆవిడ? ఇంట్లో లేరా?" అని అడిగాడు సుబ్బారావు కామేశ్వరరావుని. సుబ్బారావుకి పెళ్ళికాని రోజుల్లో కూడా కామేశ్వరరావు ఇంటికి వెళుతూ ఉండేవాడు. అతనికి వాళ్ళింట్లోని మనుష్యులందరితో పరిచయం వుంది.

"మా అమ్మ ఈ ఊరు వచ్చిందని నీకు నేను చెప్పి నెలయింది. మా ఆవిడ వుద్యోగంతో బోర్‌కొట్టి వెళ్ళిపోయింది. మా వూరికి' అన్నాడు నవ్వుతూ.

"పాపం! ఆవిడకి ఈ ఊళ్ళో ఏం తోచదు" అంది కామేశ్వరి సానుభూతిగా.

"మీ ఊళ్ళో ఇంకాఎవరైనా వున్నారా" అని అడిగింది సుబ్బలక్ష్మి.

"లేరండీ. ఆవిడ ఒక్కతే వుంటారు కాని అలవాటైన ఊరు. చెట్లు చేమలు చూసుకుంటూ తన స్నేహితులతో కబుర్లు చెప్తూ కాలం గడుపుతారు" అంది కామేశ్వరి.

"మీరు వుద్యోగం మానేస్తే ఆవిడ ఇక్కడే వుంటారేమో కదా" అంది సుబ్బలక్ష్మి కామేశ్వరరావు తన భార్య ఉద్యోగంతో తన తల్లి బోర్‌కొట్టి వెళ్ళి పోయిందని అన్న మాటను మనసులో పెట్టుకొని, "నాకింట్లో కూర్చుంటే తోచదండీ పైగా ఈ రోజుల్లో ఇద్దరం సంపాదిస్తే గాని సరిపోదు" అంది కామేశ్వరి.

వాళ్ళకి స్కూటర్ వుంది. హాల్లో రిఫ్రిజిరేటర్ కనిపిస్తోంది ఇంకా ఏమిటట వీళ్ళ అవసరం! అత్తగారు దగ్గరుండడం ఇష్టంలేకగాని అనుకొంది సుబ్బలక్ష్మి. ఆ స్కూటర్ ఫ్రిజ్ భార్య సంపాదనతోనే కామేశ్వరరావుకొన్నాడని, కట్నం తీసుకొని కామేశ్వరరావు భార్య సంపాదనతోనే తనచెల్లెలు పెళ్ళికి చేసిన అప్పు తీరుస్తున్నాడనిగాని ఆమెకు తెలియదు.

"నేనైతే ఉద్యోగం మానేసి అత్తగారికి సేవ చేద్దును అది నా మొదటి విధిగా భావిస్తాను" అంది సుబ్బలక్ష్మి కామేశ్వరి తెల్లబోయింది.

కామేశ్వరరావు "ఏమోయ్, వాళ్ళ కోసం చేసిన టిఫిన్ పెట్టనేలేదు" అని మాట మార్చి వాతావరణం తేలికపర్చాడు.

కామేశ్వరి లోపలికి వెళ్ళి టిఫిన్లు తెచ్చింది రెండు మూడురకాలు చేసింది అవి తినడం అయ్యాక ఫ్రిజ్‌లోంచి బాదంఘీర్ తీసి గ్లాసులో పోసి తాగడానికిచ్చింది. ఆమె అన్ని ఏర్పాట్లు ముందుగానే చేసుకొని స్నేహితులు వచ్చే సమయానికి విశ్రాంతిగా కూర్చుంది. అది సుబ్బలక్ష్మికి డాబుగా కనిపించింది.

ఇంటికి వెళ్ళాక సుబ్బారావు సుబ్బలక్ష్మిని కేకలు వేశాడు.

"అవసరంలేకుండా ఉద్యోగం చెయ్యటం నాకు నచ్చదండీ పైగా ఆ అత్తగారికి తోడుగా ఉండాల్సిన బాధ్యత కూడా కామేశ్వరిగారికి వుంది" అంది సుబ్బలక్ష్మి మొండిగా.

"కామేశ్వరిగారికున్న బాధ్యతలు నీకన్నా ఆవిడకే ఎక్కువగా తెలుసును. ఇంతవరకు నువ్వే బరువులు మోసావు కనక నీకర్థమౌతాయి" అని విసుక్కున్నాడు.

ఆ తర్వాత ఆర్నెల్లకీ సుబ్బారావు తల్లివచ్చి ఓ వారం ఉంది. అప్పుడు సుబ్బలక్ష్మి అట్టహాసంగా అత్తగారికి అమర్చి పెట్టింది కామేశ్వరితో పోల్చుకొని పొంగిపోయింది. అయితే అత్తవారివైపువారు ఎవరూ తరువాత రాకపోవడంవలన ప్రతీ రెండు నెలలకి కామేశ్వరి అత్తగారువచ్చి ఓ నెల ఉండిపోతూ ఉండడం వలన సుబ్బలక్ష్మికి తనభర్తకి తన అధిక్యత తెలియచేయగలిగే అవకాశం లేకపోయింది. అందుకని మరో థియరీ తయారుచేసింది. కామేశ్వరి అత్తగారు అనవసరంగా అటూ ఇటూ తిరుగుతూ వుంటారు.

తాము అనవసరంగా డబ్బు రైళ్లకి పోయ్యారు. అవసరం లేక తన అత్తగారురాదుకాని, వుంటేవచ్చును తను ఆవిడనునెత్తిమీద పెట్టుకొన్నును. అలా అనుకొని సుబ్బలక్ష్మి తృప్తి పడింది.

పెళ్ళయి రెండు సంవత్సరాలైనా సుబ్బలక్ష్మికి పిల్లలు పుట్టలేదు. పుట్టి వుంటే "పిల్లలు లేని ఇల్లు ఎంత వెలితిగా ఉంటుందో వ్యాఖ్యానించి వుండేది. కాని తనకి లేకపోవడంతో "పెళ్ళవగానే అర్జెంటుగా కనెయ్యాల్సిన అవసరం తనకిలేదు. ఇంకా బోలెడు వయస్సుంది దానికి" అని సమాధానపడింది.

"పెళ్ళికాని ఆడపిల్లలు, తమని తాము పోషించుకోవాల్సిన అవసరం ఉంది కనక చదువుకొని ఉద్యోగాల్చేస్తారు, కాని తనకా అవసరంలేదు. మొగుడికి తోడు ఇవ్వగలిగిన చదువు ఉంది" అనుకొనేది మొదట్లో.

కాని కొత్త కాపురం మోజు తీరాక తోచక కాలేజీలో చేరింది. బియ్యే పరీక్షలు వ్రాసేసరికి కడుపుతోఉంది. "కాలక్షేపానికి చదివానుగాని ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం కొద్దికాదు కదా!" అంటూ పిల్లల్ని కనటమే తన జీవితలక్ష్యము అయినట్టు అందరితో అనడం మొదలు పెట్టింది.

రెండో వాడుపుట్టాక సుబ్బారావు ఇంక పిల్లలు అనవసరం అని ఆపరేషన్ చేయించుకున్నాడు,అప్పటినుంచి "ఇద్దరు పిల్లలకి మించి ఎందుకు? అనవసరపు బాధ్యత!" అని ఇరుగుపొరుగువారికి సలహాలిస్తూ వచ్చింది.

రెండోవాడు నర్సరీలో జేరాక ఖర్చులు పెరిగాయి. తీరుబడి పెరిగింది. డిగ్రీ చదువు వ్యర్థమైపోతున్న భావం కలిగి నలుగిరితో అంటే సుబ్బారావు స్నేహితుడొకడు సుబ్బలక్ష్మికి ఉద్యోగము ఇచ్చాడు. బస్సులో వెళ్ళి బస్సులో వచ్చేది తనకంటే ముందుగా స్కూలునించి వచ్చే పిల్లల్ని తీసుకురావడానికి, కనిపెట్టుకొని వుండటానికి, వాళ్ళకి సెలవుండి తనకు లేనిపూట చూసిపెట్టడానికి ఓ మనిషి కావాల్సి వచ్చి–

"మీ అమ్మగార్ని రమ్మని వ్రాస్తున్నాను" అంది సుబ్బలక్ష్మి, సుబ్బారావు సరేనన్నాడు.

తిరుగుటపాలో, "నీకు ఉద్యోగము చెయ్యాల్సిన అవసరమేముంది? ఇంట్లో వుండి హాయిగా పిల్లల్ని చూసుకో!" అని అత్తగారి జవాబు వచ్చింది.

"తనకి వీలుకాకపోతే వీలుకాదని రాయొచ్చుగా! తీరి కూర్చుని సలహాలెందుకు!" అని సుబ్బలక్ష్మి గింజుకొంది. అతికష్టంమీద భోజనంపెట్టి నలభైరూపాయలిచ్చే ఒప్పందంమీద పనిపిల్లని కుదుర్చుకొంది. ఓ బీదపిల్లకింత ఆధారం చూపించగలిగినందుకు సంతోషించింది.

ఒకరోజు ఆఫీసు నుంచి భార్యకార్లో రావడం చూసి సుబ్బారావు ఆశ్చర్యపోయాడు.

"మీ ఆఫీసుకారా?" అని అడిగాడు.

"కాదు మాకొలీగ్‌ది. ఆయన ఇక్కడే ఉంటాడు". బస్సుకోసం నిలబడ్డాను ఎంతోసేపు. ఆ బస్సు పాడైందిట – రాలేదు. అప్పుడీయన దేవుడిలా కనిపించాడు. వస్తారా అని

అడిగాడు. అడగటం తడువు ఎక్కి కూర్చున్నాను" సుబ్బలక్ష్మి చెప్పడంలో మరో బస్సు కోసం కాచుకొని నిలబడాల్సిన అవస్థ తప్పినందుకు సంతోషం ధ్వనించింది.

"మంచిపని చేసావు సుబ్బులూ! ఆలస్యం కాకుండా ఇంటికి చేరుకున్నావు. చీకటి పడ్డా నువ్వు ఇల్లు చేరకపోతే కంగారు పడదును" అన్నాడు.

ఆ తరువాత సుబ్బలక్ష్మి రెండు మూడుసార్లు కొలీగ్ కార్లో రావటం ఇరుగమ్మ పొరుగమ్మ చెవులు కొరుక్కోవటం జరిగింది అది తెలిసి.

"ఉద్యోగాలుచేసుకొనే ఆడవాళ్ళ అవసరాలు ఇంట్లో కూర్చునే అమ్మలక్కలకేం అర్థమౌతాయి!" ఇతర్ల గురించి త్వరపడి తప్పుడు అభిప్రాయా లేర్పర్చుకొంటారు" అంది సుబ్బారావుతో.

మరో రోజు అఫీసు నుంచి సుబ్బారావు ఆలస్యంగా వచ్చాడు.

"ఎందుకింత ఆలస్యం అయింది?" అని అడిగింది సుబ్బలక్ష్మి.

"కామేశ్వరరావు ఊరు వెళ్ళాడు. ఇవాళ వాళ్ళ ఆవిడను డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళాల్సి ఉందిట. ఊరు వెళుతూ నన్ను రిక్వెస్టు చేసాడు. ఆవిడను డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళి ఇంట్లో దింపడంతో ఆలస్యం అయింది". అని కారణం చెప్పాడు సుబ్బారావు.

'ఆవిడను మీ స్కూటర్ మీద తీసుకువెళ్ళారా?" ఆశ్చర్యంగా అడిగింది సుబ్బలక్ష్మి.

"అవును." "పరాయి మగవాడి స్కూటర్ మీద ఎల్లా ఎక్కిందండీ  ఆవిడ మరీను సిగ్గులేకుండా" అని చటుక్కున అనేసింది సుబ్బలక్ష్మి.

"అదేమిటి సుబ్బులూ! నే నావిడకి పరాయి వాడినా? ఆవిడికి తమ్ముడి లాంటి వాడినో, మరిదిలాంటివాడినో కదా!"

"అయితే మాత్రం నేనెంత అవసరం వచ్చినా అల్లా ఇంకోమగాడి స్కూటర్ ఎక్కనుబాబు"

"అల్లా మాట్లాడ్తావేం! నువ్వు మీ కొలీగ్ కార్లోరాలా రెండుమూడు సార్లు."

"అదీ ఇదీ ఒకటేనా! ఒకళ్ళ వెనక ఒకళ్ళు ఒకరి కొకరు తగులుతూ కూర్చోడం చూడ్డానికి బావుంటుందీ!"

"ఏమోమరి! ఆవిడకి కార్లలో పరాయి మగాడి పక్కన కూర్చోడం తప్పుగా అని పించవచ్చు. నీకిది తప్పుగా కనిపిస్తే"

"నేనేం ఆవిడ మొగుడు పక్కన కూర్చోలేదు కదా!"

"మరోకళ్ళ మొగుడు పక్కన కూర్చున్నావు కదా!"

"ఆ కామేశ్వరి గార్నల్లా వెనకేసుకొని రాకండి! కావాలంటే ఆవిడ ఏ ఆటో రిక్షాలోనో వెళ్ళలేక పోయిందా! డబ్బు అదా చెయ్యటానిక కాకపోతే నేనల్లా అనవసరంగా ఛస్తే ఇతర్లవెంట పోను" అంది సుబ్బలక్ష్మి.

కామేశ్వరి వద్దంటున్నా వినకుండా కామేశ్వరరావు తనని రిక్వెస్టు చేసాడని దానికి తమ మధ్యఉన్న స్నేహం, చనువు కారణం అని సుబ్బారావు భార్యకి వివరించలేదు. భార్యకి నచ్చ చెప్పడం ఎంత కష్టమో అతనికి తెలుసు.

సుబ్బలక్ష్మికి ఉద్యోగంతోను అడపతడప పిల్లల అనారోగ్యంవల్ల చికాకు లెక్కువయ్యాయి అటువంటి సమయంలో అతిథులెవరైనా వస్తే-

"వచ్చేముందు మనకు వీలవునో, కాదో తెలుసుకొని రారాదూ! మన కిబ్బందేమో అన్న ఆలోచనైనా రాదు కొందరికి" అని విసుక్కోడం మొదలు పెట్టింది.

అటువంటి రోజుల్లో సుబ్బారావు తల్లి వచ్చింది. ఆవిడకి ఆరోగ్యం సరిగా లేక కొడుకు ఊళ్ళో పెద్ద డాక్టరుకి చూపించుకొందామని వచ్చింది. సుబ్బారావు వారంరోజులు సెలవుపెట్టి తల్లిని వైద్యులకి చూపించాడు. సుబ్బలక్ష్మికి ఆఫీసులో పనివత్తిడివల్ల సెలవు పెట్టడం కుదరలేదు. "సెలవు పెట్టి ఆవిడకు ఎదురుగ్గా కూర్చోవటం వల్ల ఏం ఒరుగుతుంది!" అనుకుంది.

పదిరోజులయ్యాక ఆవిడ తిరుగు ప్రయాణం పెట్టుకొంది. ఆవిడ తిరిగి వెళ్ళిపోతుందని తెలిసి కామేశ్వరరావు దంపతులు చూడ్డానికి వచ్చారు.

మాటల్లో "అప్పుడే వెళ్ళిపోతున్నారేం?" అని అడిగింది కామేశ్వరి.

"ఆవిడకి ఉండటానికి కుదరద్దూ!" అంది సుబ్బలక్ష్మి.

"ఉండటానికి కుదరక పోవడంకాదు కానీ, దానికసలే ఇంట్లో పిల్లలు, బయట ఉద్యోగం దాంతో ఊపిరాడదు. పైగా నన్ను కూర్చోపెట్టి చెయ్యాలంటే కష్టంకదా!" అంది సుబ్బారావు తల్లి.

"మీకు మీ కోడలు సంగతి తెలియదండీ. ఆవిడ తన ఉద్యోగం మానేసి అయినా మీకు సేవచేస్తుంది. అది ఆవిడ తన మొదటి బాధ్యతగా భావిస్తుంది" అంది కామేశ్వరి. అది మెచ్చుకోలో, ఎత్తిపొడుపో సుబ్బలక్ష్మికి తెలియలేదు.

"మా ఆవిడకి డిగ్రీ లేనప్పుడు పిల్లలు లేనప్పుడు ఉద్యోగం చెయ్యటం అనవసరమని అనుకొనేది. డిగ్రీ వచ్చాక, ఖర్చులు పెరిగాక ఆవిడ అలా అనుకోడం లేదు" అన్నాడు సుబ్బారావు. భర్త తనని వేనకేసుకొని వస్తున్నాడో విమర్శిస్తున్నాడో సుబ్బలక్ష్మికి అర్థం కాలేదు. తనభావం తెలియనీయకుండా-

"మా అత్తగారు ఉంటాననాలేగాని అంత కంటేనా. కాని ఆవిడ మా ఊరు వెళ్ళటం అవసరం. ఆవిడ లేకుండా అక్కడ ఇల్లు నడవదు" అంది సుబ్బలక్ష్మి గడుసుగా.

"అందుకేనే అమ్మాయ్, ఆమధ్య నువ్వు రమ్మని రాసినా రాలేకపోయింది. నాకు తెలుసు - నేను రాలేనని రాస్తే నువ్వు కోపం తెచ్చుకోవనీ, నా ఇబ్బంది అర్థం చేసుకొంటావనీ" అంది అత్తగారు.

సుబ్బలక్ష్మికి చురుక్కున తగిలింది"

సుబ్బలక్ష్మికి తనది "అవసరం" గురించిన థీరీకాదని "తన అవసరం" గురించిన థీరీ అని కొద్దిగా ఆరోజున బోధపడింది.